


# ఆరోగ్య జ్యోతి



సంపుటి-1, సంచిక-1, 15 ఆగస్టు 2026 ఎడిటర్ : కే నరేష్ కుమార్ పేజీలు-6 వెల రూ.5/- www.aarogyajyothi.com

## ఏఎన్ఎంల మెరిట్ జాబితా కోసం ఎదురుచూపులు

- 1,931 పోస్టులతో ఉద్యోగ ఆశలు.. తుది ఫలితాల కోసం అభ్యర్థుల నిరీక్షణ
- పరీక్ష పూర్తయి నెలలు గడిచినా నియామక ప్రక్రియపై స్పష్టత కోసం ఎదురుచూపులు
- జూలై 10న తొలి జాబితా విడుదల.. తుది మెరిట్ లిస్ట్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ
- ఖాళీలను గుర్తించి పోస్టులు పెంచితే మరింత మందికి కొలువుల అవకాశం



నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలంటూ పోరాటాలు చేసిన ఆరోగ్య కార్యకర్తలు, నోటిఫికేషన్ అనంతరం దరఖాస్తులు చేసుకుని పరీక్షలు కూడా రాశారు. పరీక్ష ఫలితాలు వెలువడినా, ఆరోగ్య కార్యకర్తల పోస్టింగులకు సంబంధించిన ఫైనల్ లిస్ట్ మాత్రం ఇంకా విడుదల కాలేదు.గ్రామస్థాయిలో ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయడంలో ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తారు. ఫైనల్ లిస్ట్ విడుదలై ఉద్యోగాల ఎంపిక జరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు, జాబితా ఆలస్యంతో అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫైనల్ లిస్ట్ విడుదల చేసి, ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆరోగ్య కార్యకర్తలు కోరుతున్నారు.

2

## వైద్య ఖర్చులకు కళ్లెం.. ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు

- సామాన్యులపై పెరుగుతున్న వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు చర్యలు
- గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం
- జన ఔషధి కేంద్రాల సంఖ్య పెంచాలని కమిటీ సూచన
- ఆరోగ్య బీమా ప్రయోజనాలు రోగులకు సులభంగా అందేలా చర్యలు
- మొబైల్ వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు విస్తరించాలని సిఫారసు
- ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచాల్సిన అవసరం
- ఆరోగ్య రంగానికి ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఆరోగ్యజ్యోతి): ఖరీదైన వైద్య చికిత్సలతో సామాన్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ స్థాయి కమిటీ సూచించింది. అత్యవసర వైద్యం నుంచి ప్రాణాంతక వ్యాధుల చికిత్స వరకు ప్రతి దశలో రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. వైద్య సేవలు కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా సమానంగా అందేలా వ్యవస్థను విస్తరించాల్సిన అవసరాన్ని కమిటీ స్పష్టం చేసింది.

**ఆసుపత్రి ఖర్చులపై నియంత్రణ అవసరం**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స, పరీక్షలు, మందులు, వైద్య పరికరాల వినియోగానికి సంబంధించిన ఖర్చులపై పారదర్శకత ఉండాలని కమిటీ పేర్కొంది. ముఖ్యంగా తీవ్రమైన వ్యాధుల చికిత్సలో భారీగా ఖర్చు అవుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రోగులకు ముందుగానే చికిత్సకు అయ్యే వ్యయంపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించింది.

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో ఆధునిక వైద్య విధానాలు, ఇమ్యూనోథెరపీ, జనోమిక్స్ వంటి చికిత్సలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ వాటి ఖర్చు సామాన్యులకు భారంగా మారకుండా చర్యలు తీసుకోవాలని తెలిపింది. ప్రాణాలను కాపాడే మందులు, అత్యవసర వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక విధానం అవసరమని పేర్కొంది.



2

**గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణ**

నాణ్యమైన వైద్యం నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరాలని కమిటీ సూచించింది. దూర ప్రాంతాల నుంచి పెద్ద ఆసుపత్రులకు రావాల్సిన అవసరం తగ్గేలా స్థానికంగానే అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందించే సౌకర్యాలను పెంచాలని పేర్కొంది.

ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అవసరమైన

## స్టైపెండ్ పెంపు కోసం ఆయుష్ హౌస్ సర్జన్ల సమ్మె

- పది రోజులుగా కొనసాగుతున్న నిరసన.
- ప్రభుత్వం స్పందించాలని డిమాండ్
- అలోపతి వైద్యులతో సమానంగా స్టైపెండ్‌చెల్లించాలని విజ్ఞప్తి
- జీవో నంబర్ 77 అమలు చేయాలని కోరుతున్న హౌస్ సర్జన్లు

2

## ఆరోగ్య ప్రదాత సంజీవని

- పైలట్ ప్రాజెక్టుకు అరకులోయ మండలం సుంకరమెట్ట పీహెచ్‌సీ ఎంపిక
- దీని ఫలితాల ఆధారంగా అన్నీ పీహెచ్‌సీల్లో అమలుకు నిర్ణయం
- 22న ఈ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించే అవకాశం
- మారుమూల గిరిజన గ్రామాలకు ఎంతో మేలు




2

## 600 మంది గర్భిణుల వీసాలు రద్దు చేసిన అమెరికా..



హైదరాబాద్,(ఆరోగ్యజ్యోతి): బర్త్ టూరిజంపై అమెరికా ఉక్కుపాదం మోపుతోంది. పిల్లలను కనడానికే అమెరికాకు వచ్చే వారిని నియంత్రిస్తోంది. ఒక్క జులై నెలలోనే 9వ నెల గర్భంతో ఉండి అమెరికాకు వచ్చిన 600 మంది వీసాలను రద్దు చేసింది. బర్త్ టూరిజం నిరోధక టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో వీసాలను పరిశీలించి రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో తెలిపారు. మరోవైపు కఠిన వీసా నిబంధనల కారణంగా అమెరికాకు ఈ ఏడాది వచ్చిన విద్యార్థుల సంఖ్య తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫాల్ సీజన్లో 1.12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు.

## చిన్నారుల టీకాలలో కోత – ఉత్తర్వుపై సంతకం చేసిన ట్రంప్



వాషింగ్టన్ : చిన్నారులకు ఇచ్చే టీకాల సంఖ్యను కుదించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. గవదబిళ్లలు, తట్టు, రుబెల్లా వంటి వ్యాధులకు ఇచ్చే టీకాలను కూడా ఆయన విభజించారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. ఈ రోజు అవసరమైన టీకాలలో చాలా తక్కువ వాటిని మాత్రమే దశాబ్దాల క్రితం పిల్లలు తీసుకునే వారని ట్రంప్ చెప్పారు. 'ఆ రోజులలో ప్రజలు చాలా ఆరోగ్యంగా ఉండేవారు. అందుకే ఇప్పుడు మనం చూస్తున్న అధిక ఆటిజం రేట్లు అప్పుడు లేవు' అని అన్నారు. కాగా ట్రంప్ తాజా ఉత్తర్వుపై వైద్య నిపుణులు విమర్శలు కురిపించారు. టీకాల రేటు తగ్గితే చిన్నారులు హానికరమైన వ్యాధులకు గురవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఏఏపీ) సిఫార్సు చేసిన 18 టీకాలను 11కు తగ్గించాలని ట్రంప్ తన ఉత్తర్వులో సిఫార్సు చేశారు. కాగా అమెరికాలో విద్యార్థులకు కావాల్సిన టీకాల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర స్థాయిలో నిర్ణయిస్తారు కాబట్టి ట్రంప్ ఉత్తర్వు కేవలం ఓ మార్గదర్శకంగానే పనిచేస్తుంది.

## ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా



ఢిల్లీ, (ఆరోగ్యజ్యోతి): కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. గురువారం ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్చారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. జేపీ నడ్డా వయసు 65. ఈ నేపథ్యంలో ఆయనకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు అనేక రకాల పరీక్షలు నిర్వహించారు. వాటిలో కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష కూడా ఉంది.

ప్రస్తుతం జేపీ నడ్డా ఆరోగ్యం నిలకడగా ఉందని, కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రివర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. గురువారం సాయంత్రం ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వెల్లడించాయి. అయితే, ఆయనకు గల అనారోగ్య సమస్యకు సంబంధించిన వివరాల్ని మాత్రం వివరించలేదు. సాధారణంగా గుండె రక్త నాళాల్లో ఏదైనా సమస్య, అడ్డంకి ఉందా అని తెలుసుకునేందుకు వైద్యులు కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఏదైనా సమస్య తలెత్తితే అవసరమైన శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. జేపీ నడ్డా గతంలో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా పని చేశారు.ఆ తర్వాత ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా నితిన్ నబిన్ చేపట్టారు. మోదీ క్యాబినెట్‌లో నడ్డా కీలకంగా ఉన్నారు. మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడు. ఇదే సమయంలో పార్టీని జాతీయ స్థాయిలో బలోపేతం చేసిన నేతగానే కాకుండా, వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి తెచ్చిన నాయకుడిగానూ నడ్డాకు పేరుంది.

## కిడ్నీ రాకెట్ కేసు పై నిర్లక్ష్యం... అన్నమయ్య డి ఎం ఎం హెచ్ ఓ సస్పెన్షన్ వేటు?..

అన్నమయ్య: మదనపల్లెలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసు వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభియోగాలపై అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. లక్ష్మీనరసయ్యను ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి. వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు. కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి ఆధారాలు లేవంటూ తప్పుదోవ పట్టించేలా నివేదిక ఇచ్చారని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆస్పత్రి లైసెన్స్ సస్పెండ్ చేయడంతోనే తన పాలనా చర్యలను పరిమితం చేశారని, అనంతరం స్వాధీనం ప్రక్రియ సందర్భంగా కేసులోని వాస్తవాలను హైకోర్టుకు తెలియజేయడంలోనూ విఫలమయ్యారని ప్రభుత్వం పేర్కొంది. డీఎంహెచ్వోపై శాఖాపరమైన విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.విశాఖపట్నానికి చెందిన యమున (29)కు మదనపల్లె గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అక్రమంగా కిడ్నీ తొలగించే ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత తీవ్రనొప్పితో 2025 నవంబరు 10న తెల్లవారుజామున ఆమె మరణించారు. విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఆసుపత్రి సిబ్బంది. దళారులు కలిసి ఆమె మృతదేహాన్ని రహస్యంగా తిరుపతికి తరలించారు. యమునతో పరిచయం ఉన్న సూరిబాబు అనే వ్యక్తికి దళారులు మొదట ఇస్తామన్న రూ.6 లక్షల డబ్బు ఇవ్వకపోవడం, ఆమె మరణించడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్పట్లో ఘటన వెలుగులోకి వచ్చింది.

## ఆరోగ్యశ్రీకి నిధులు విడుదల




ఆదిలాబాద్, (ఆరోగ్యజ్యోతి):రాజీవ్ గాంధీ యూనివర్సిటీ మెడికల్ సైన్స్ ఆస్పత్రిలో 2023 నుంచి 25 వరకు వివిధ విభాగాల్లో శాస్త్ర చికిత్సలకు సంబంధించిన పెండింగ్ బిల్లు 6 కోట్ల 33 లక్షల 25 వేల రూపాయలు విడుదలయ్యాయి. మొత్తం 8.1 కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ నిధులు పెండింగ్లో ఉండగా అందులో ఆరు కోట్ల 33 లక్షల 25 వేల రూపాయలు విడుదలయ్యాయి. కొన్ని నిధులు వైద్యులు మరియు వైద్య సిబ్బందికి మిగతా నిధులను ఎంత పరికరాలు కొనుగోలు చేయడానికి వినియోగిస్తారు. ఇది ఏమైనాప్పటికీ ఆరోగ్యశ్రీ నిధులు విడుదల కావడం వల్ల ఆటో వైద్య సిబ్బందికి ఆసుపత్రి అభివృద్ధి కోసం ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయి.

## ఏఎన్ఎంల మెరిట్ జాబితా కోసం



తెలంగాణ బ్యూరో,(ఆరోగ్యజ్యోతి): తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) / ఏఎన్ఎం పోస్టుల కోసం పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. పరీక్ష పూర్తయి చాలాకాలం గడిచినా తుది మెరిట్ జాబితా ఎప్పుడు వెలువడుతుంది.. నియామక ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుంది అనే ప్రశ్నలకు సమాధానం కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. 1,931 పోస్టులతో ఉద్యోగ నోటిఫికేషన్ రావడంతో ఆశలు పెంచుకున్న వేలాది మంది అభ్యర్థులు తమ భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ విడుదలైంది. అనంతరం 2024 డిసెంబర్ 29న అర్హత పరీక్ష నిర్వహించినట్లు అభ్యర్థులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 1,931 పోస్టులు ఉండటంతో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తామనే ఆశలు చిగురించాయి.

పరీక్ష ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫలితాల కోసం అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 2026 జూలై 10న తొలి జాబితా విడుదలైనట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. అయితే తుది మెరిట్ జాబితా, అభ్యర్థుల మెరిట్ స్థానం, తదుపరి నియామక ప్రక్రియపై పూర్తి స్పష్టత రావాల్సి ఉందని వారు చెబుతున్నారు. తమ పేరు మెరిట్ జాబితాలో ఎక్కడ ఉంటుందో, ప్రభుత్వ ఉద్యోగం దక్కుతుందో లేదోనన్న ఉత్కంఠతో ఎదురుచూస్తున్నామని పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు.

ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమవుతూ పరీక్షలు రాసిన అభ్యర్థులకు ప్రతి రోజు ఒక ఆశతోనే గడుస్తోందని చెబుతున్నారు. మెరిట్ జాబితా ఆలస్యం కావడంతో తదుపరి దశపై స్పష్టత లేకపోవడం ఆందోళనకు కారణమవుతోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం అధికారికంగా పూర్తి వివరాలను వెల్లడించి నియామక ప్రక్రియకు సంబంధించిన కాలపట్టికను ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజారోగ్య వ్యవస్థలో ఏఎన్ఎంల పాత్ర అత్యంత కీలకమైనది. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు చేరవేయడంలో ఏఎన్ఎంలు ముందుంటారు. గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, టీకాల కార్యక్రమాలు, కుటుంబ సంక్షేమ సేవలు, వ్యాధులపై అవగాహన కల్పించడం వంటి అనేక బాధ్యతలను క్షేత్రస్థాయిలో నిర్వర్తిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ కావాలంటే క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని అభ్యర్థులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా, ప్రస్తుతం నోటిఫికేషన్‌లో ఉన్న 1,931 పోస్టులకు అదనంగా వైద్య ఆరోగ్యశాఖలోని ఖాళీలను గుర్తించి పోస్టుల సంఖ్యను పెంచాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అదనపు పోస్టులను భర్తీ చేస్తే అర్హత కలిగిన మరింతమంది అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఒకవైపు నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో పాటు మరోవైపు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థకు అవసరమైన మానవ వనరులు సమకూరుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యేకించి గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలంటే ఏఎన్ఎంల సంఖ్యను పెంచడం అవసరమని అభ్యర్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను సమగ్రంగా పరిశీలించి సాధ్యమైన మేరకు అదనపు పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరుతున్నారు. దీంతో ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత వేగంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.మెరిట్ జాబితా విడుదలలో జాప్యం కారణంగా అభ్యర్థుల్లో అయోమయం నెలకొంటోందని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి నియామక ప్రక్రియపై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పరీక్ష రాసిన అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తుది జాబితాను త్వరితగతిన ప్రకటించి, అర్హత సాధించిన వారికి నియామకాలు చేపట్టాలని కోరుతున్నారు.

"ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాం. పరీక్ష రాశాం.. ఫలితాల కోసం నిరీక్షిస్తున్నాం. మెరిట్ లిస్ట్ విడుదల చేసి అర్హత సాధించిన వారికి త్వరగా నియామకాలు చేపట్టాలి. ఖాళీలను గుర్తించి పోస్టుల సంఖ్యను పెంచితే మరింతమందికి అవకాశం లభిస్తుంది" అని ఏఎన్ఎం అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మెరిట్ జాబితాను

## వైద్య ఖర్చులకు కళ్లెం.. ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు

చోట ప్రైవేట్ ఆసుపత్రులు కూడా సేవలను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక వసతులు పెంచడం ద్వారా పేద ప్రజలకు వైద్యం మరింత చేరువ అవుతుందని తెలిపింది.

**జన ఔషధి కేంద్రాలు మరింత విస్తరించాలి**

తక్కువ ధరలకు మందులు అందించే జన ఔషధి కేంద్రాల సంఖ్యను పెంచాలని కమిటీ సూచించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ఔషధాలు సులభంగా లభించేలా ఈ కేంద్రాలను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు నిరంతరం అందుబాటులో ఉండేలా డిజిటల్ విధానంలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించింది. మందుల కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడకుండా సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చాలని తెలిపింది.

**బీమా పరిమితులపై స్పష్టత**

ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ చికిత్స సమయంలో ఏ సేవలకు ఎంతవరకు బీమా వర్తిస్తుంది అనే విషయంలో ప్రజలకు స్పష్టత లేకపోవడం సమస్యగా మారుతోందని కమిటీ పేర్కొంది. బీమా పరిమితులు, చికిత్సకు సంబంధించిన నిబంధనలు రోగులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించే వ్యవస్థ ఉండాలని సూచించింది.

**మొబైల్ వైద్య సేవలకు ప్రాధాన్యం**

సుదూర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మొబైల్ మెడికల్ యూనిట్లను విస్తృతంగా వినియోగించాలని కమిటీ సూచించింది. అవసరమైన నిర్ధారణ పరీక్షలను గ్రామీణ ప్రాంతాల్లోనే నిర్వహించే విధంగా మొబైల్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది.

**ఆరోగ్య రంగ ద్రవ్యోల్బణంపై ఆందోళన**

వైద్య రంగంలో ఖర్చులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య సేవలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. ఆరోగ్య రంగ ద్రవ్యోల్బణం సుమారు 13 శాతానికి చేరిన పరిస్థితిని ప్రస్తావిస్తూ, చికిత్స ఖర్చులు సామాన్య కుటుంబాలపై అధిక భారంగా మారకుండా దీర్ఘకాలిక విధానాలు రూపొందించాలని సూచించింది.

**జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య నిధులు**

ఆరోగ్య రంగానికి అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఆరోగ్య నిధులను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. ప్రభుత్వ గ్రాంట్లు, ఇతర అందుబాటులో ఉన్న వనరులను సమన్వయం చేసి ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించింది.




**బెడ్ల సంఖ్య పెరగాలి**

దేశంలో ప్రతి వెయ్యి మందికి ప్రస్తుతం సగటున 1.3 ఆసుపత్రి బెడ్లు మాత్రమే ఉన్నాయని కమిటీ పేర్కొంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆసుపత్రి పడకల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రి మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు పెంచితే అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా చికిత్స అందించే అవకాశం ఉంటుందని సూచించింది.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు చికిత్స ఖర్చు అందుబాటులో ఉండేలా చేయడం కూడా ఆరోగ్య వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ఉండాలని కమిటీ స్పష్టం చేసింది.

## స్టైపెండ్ పెంపు కోసం ఆయుష్ హౌస్ సర్జన్ల సమ్మె

తెలంగాణ బ్యూరో (ఆరోగ్య జ్యోతి): ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రుల్లో హౌస్ సర్జన్లుగా విధులు నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు తమ స్టైపెండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. ప్రస్తుత స్టైపెండ్ తమ అవసరాలకు సరిపోవడం లేదని, అలోపతి వైద్య విభాగంలో హౌస్ సర్జన్లకు అందుతున్న స్టైపెండ్‌తో పోలిస్తే ఆయుష్ హౌస్ సర్జన్లకు గణనీయమైన వ్యత్యాసం ఉందని వారు పేర్కొంటున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.ఆయుష్ వైద్య సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న హౌస్ సర్జన్లు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఆందోళన కొనసాగుతున్నట్లు హౌస్ సర్జన్లు తెలిపారు. పది రోజులుగా నిరసన కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి తమ డిమాండ్లపై స్పష్టమైన స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆయుష్ వైద్య విద్యను అభ్యసించిన అనంతరం హౌస్ సర్జన్లుగా విధులు నిర్వహిస్తూ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని వారు తెలిపారు. రోగుల పరిశీలన, వైద్యుల సూచనల మేరకు చికిత్సలో సహకారం, ఆసుపత్రి విధులు వంటి బాధ్యతలను నిర్వహిస్తున్నప్పటికీ తమకు అందుతున్న స్టైపెండ్ చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు.

**స్టైపెండ్‌లో భారీ వ్యత్యాసం**

ఆయుష్ హౌస్ సర్జన్లకు ప్రస్తుతం నెలకు సుమారు రూ.13,754 స్టైపెండ్ మాత్రమే అందుతోందని వారు చెబుతున్నారు. అదే సమయంలో అలోపతి వైద్య విభాగంలో హౌస్ సర్జన్లకు సుమారు రూ.29,972 వరకు స్టైపెండ్ అందుతున్నట్లు పేర్కొంటున్నారు. ఒకే



ప్రభుత్వ వైద్య వ్యవస్థలో హౌస్ సర్జన్లుగా విధులు నిర్వహిస్తున్నప్పుడు స్టైపెండ్‌లో ఇంతటి వ్యత్యాసం ఉండటం సమంజసం కాదని వారు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుత కాలంలో వసతి, ఆహారం, ప్రయాణం, విద్య, ఇతర రోజువారీ ఖర్చులు పెరిగిపోయాయని, అందుతున్న స్టైపెండ్‌తో కనీస అవసరాలను కూడా నిర్వహించడం కష్టంగా మారిందని హౌస్ సర్జన్లు చెబుతున్నారు. తమ సేవలను ప్రభుత్వం గుర్తించి అలోపతి హౌస్ సర్జన్లతో సమానంగా స్టైపెండ్ అందించాలని కోరుతున్నారు.

**జీవో నంబర్ 77 అమలు చేయాలి**

తమ సమస్యల పరిష్కారంలో భాగంగా జీవో నంబర్ 77ను అమలు చేయాలని ఆయుష్ హౌస్ సర్జన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ జీవోకు అనుగుణంగా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. స్టైపెండ్ పెంపుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు తమ ఆందోళనను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు.ఆయుష్ వైద్య విధానాలకు రాష్ట్రంలో మంచి ఆదరణ ఉందని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో హౌస్ సర్జన్లు కూడా తమ వంతు బాధ్యత నిర్వహిస్తున్నారని తెలిపారు. తమ సమస్యను కేవలం వేతన అంశంగా కాకుండా వైద్య విద్యార్థుల భవిష్యత్తు, సేవలకు సంబంధించిన అంశంగా ప్రభుత్వం పరిగణించాలని కోరుతున్నారు.

**ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలి**

తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సానుకూల నిర్ణయం తీసుకోవాలని హౌస్ సర్జన్లు విజ్ఞప్తి చేస్తున్నారు. స్టైపెండ్ పెంపుతో పాటు అలోపతి హౌస్ సర్జన్లతో సమానంగా సేవా ప్రయోజనాలు కల్పించాలని కోరుతున్నారు.ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తే విధులకు తిరిగి హాజరై రోగులకు యథావిధిగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హౌస్ సర్జన్లు పేర్కొంటున్నారు. ఆయుష్ వైద్య విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లకు స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఆయుష్ హౌస్ సర్జన్ల స్టైపెండ్ పెంపు అంశంపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుని, అలోపతి వైద్య విభాగంతో ఉన్న వ్యత్యాసాన్ని తొలగించాలని హౌస్ సర్జన్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా. రజా మాలిక్ ఖాన్ బాధ్యతల స్వీకరణ



కొడంగల్,(ఆరోగ్య జ్యోతి): కొడంగల్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డా. రజా మాలిక్ ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ఎంఓ డా. రవీంద్ర యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గెజిటెడ్ అధికారులు, జీవ రసాయన నిపుణుడు మంచాల రవీందర్, కార్యాలయ పరిపాలనాధికారి ప్రతాప్ సింగ్ పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సూపరింటెండెంట్‌కు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఫారూక్, రాధాకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్లు బాబ్యా, పాండు, ఇస్మాయిల్, బాలరాజుతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొని డా. రజా మాలిక్ ఖాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆరోగ్య ప్రదాత సంజీవని

పాడేరు,(ఆరోగ్యజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పిస్తూ అత్యాధునిక డిజిటల్ వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు చేరువ చేసేందుకు సంజీవని ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తున్నది. ఇందులో భాగంగా కుప్పం ప్రాంతంలో సంజీవని(సాంకేతిక ఆధార ప్రజారోగ్య సేవా కార్యక్రమం) పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. అలాగే అల్లూరి జిల్లాలోని అరకులోయ మండలం సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంజీవని పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసి, పీహెచ్‌సీ పరిధిలోని ప్రజల ఆరోగ్య సంబంధ సమాచారాన్ని డిజిటలైజేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల గిరిజనులకు సంజీవని ప్రాజెక్టు ద్వారా ఎంతో మేలు జరుగుతుందని వైద్య, ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు అమలు వలన ప్రతి గిరిజనుడి వైద్య సంబంధిత వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండడం ద్వారా మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుంది. అవసరాన్ని బట్టి ఎక్కడి నుంచైనా వైద్య నిపుణులు రోగులకు అవసరమైన సేవలు అందించే వెసులుబాటు ఉంటుంది. ఎటువంటి ప్రైవేటు, కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులో లేని గిరిజన ప్రాంతానికి పూర్తిగా సాంకేతికత ఆధారంగా వైద్య సేవలు అందించే సంజీవని ప్రాజెక్టు ఒక వరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.అరకులోయ మండలం సుంకరమెట్ట పీహెచ్‌సీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నందున ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రారంభోత్సవం చేయించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 22న అరకులోయ మండలంలోనే సంజీవని ప్రాజెక్టును ప్రారంభిస్తారని అధికారులు అంటున్నారు. అయితే సీఎం పర్యటన పక్కాగా ఇంకా ఖరారు కాలేదు.

**సంజీవని ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలు**

- ప్రతి ఒక్కరికీ ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తారు.
- కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో ఆరోగ్య విశ్లేషణ చేస్తారు.
- మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా పల్లెల్లో వైద్య సేవలు అందిస్తారు.
- ప్రతి కుటుంబ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారు.
- ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తారు.
- ప్రతి వ్యక్తికి సంబంధించి డిజిటల్ హెల్త్ రికార్డును రూపొందిస్తారు.
- రోగులు ఎక్కడ వైద్య సేవలు పొందినా వారికి సంబంధించిన రిపోర్టులు, ఇతర సమాచారాన్ని తక్షణమే ఎక్కడికక్కడ పొందే అవకాశం కలుగుతుంది.
- మారుమూల గిరిజన రోగులకు సంబంధించి నిపుణులైన వైద్యులతో టెలీమెడిసన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, వైద్య నిపుణులను వీడియో ద్వారా సంప్రతించే అవకాశం కల్పిస్తారు.
- రోగుల స్థితిగతుల ఆధారంగా అవసరమైతే ఉన్నత ఆస్పత్రులకు తరలిస్తారు.

## ముప్పైలో అరవైలా...

ముప్పైలో అరవైలా...
ఎముకలు అరుగుతున్నాయ్.. కీళ్లు విరుగుతున్నాయ్
చిన్న వయస్సులోనే కీళ్ల అరుగుదల
మారిన జీవనశైలే కారణం
జిల్లాలో పెరుగుతున్న ఈ తరహా సమస్యలు
కనీస శారీరక శ్రమ అవసరమంటున్న వైద్యులు
శీతల పానీయాల వాడకం తగ్గించాలని సూచన

వయసు పైబడిన వారిలో ఎముకల బలహీనత, కీళ్ల నొప్పుల సమస్యలు ఇప్పుడు యువతను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలో ఇటీవల కాలంలో ఈ తరహా కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. 30 ఏళ్లు దాటక ముందే మోకాళ్ల నొప్పులు, నడుంనొప్పి అంటూ ఆసుపత్రి బాట పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు 60ఏళ్ల తరువాత కన్పించే ఆస్టియో ఆర్థరైటిస్ ఇప్పుడు 30 నుంచి 35 ఏళ్ల వారిలోనే కన్పిస్తున్నాయి. ఎముకల సాంద్రత తగ్గిపోవడం వల్ల చిన్నపాటి దెబ్బలకే ఎముకలు విరిగిపోయే ప్రమాదం ఏర్పడుతోంది.

**కారణాలు ఇవే**

- గంటల తరబడి కంప్యూటర్ ముందుకు కూర్చోవడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఎముకలు తమ బలాన్ని కోల్పోతున్నాయి
- ఏసీ గదుల్లో కాలం గడపడం వల్ల సూర్యరశ్మి శరీరానికి తగలడం లేదు. దీంతో విటమిన్ డి లోపించి మనం తీసుకునే ఆహారంలో కాల్షియం ఎముకలకు చేరడం లేదు.
- జంక్ ఫుడ్, సాఫ్ట్ డ్రింక్స్ అధికంగా తీసుకోవడం వల్ల పోషకాల సమతుల్యత దెబ్బతింటోంది.ముఖ్యంగా కార్బోనైటేడ్ డ్రింక్స్ ఎముకల్లోని కాల్షియంను పీల్చేస్తాయి.
- పెరిగిన శరీర బరువు మొత్తం మోకాళ్లపై పడడంతో కీళ్ల మధ్య వుండే 'కార్టిలేజ్' అనే మెత్తని పొర త్వరగా అరిగిపోతోంది.

**జిల్లాలో పరిస్థితి ఇలా**

జిల్లాలోని యువత, కళాశాల విద్యార్థుల్లో దాదాపు 20 శాతానికి పైగా ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. గంటల తరబడి స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లకు అతుక్కుని పోవడం వల్ల వీరిలో మెడనొప్పులు, మడికట్టు తిమ్మిర్లు అధిక మౌతున్నాయి. నిరంతరం గదులకే పరిమితమై, ఎండలు తగలక పోవడం వల్ల, జంకుఫుడ్స్ తీసుకోవడం తదితర కారణాలతో తీవ్రమైన విటమిన్ డి లోపంతో నడుము, కాళ్ల నొప్పులు తెచ్చుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు.




- 26 నుంచి 40 ఏళ్ల వయసులో ఎముకల సమస్యలతో వస్తున్న కేసుల్లో దాదాపు 35 శాతం ఈ కోవకు చెందిన వారేనని వైద్యులు చెబుతున్నారు. కంప్యూటర్స్ ముందు కదలకుండా కూర్చోవడం, ప్రాసెస్డ్ ఫుడ్, కూల్ డ్రింక్స్ వినియోగం, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల 30 నుంచి 35 ఏళ్లకే మోకాళ్ల అరుగుదల, తీవ్ర వెన్నునొప్పి సమస్యల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో గర్భదారణ ఆ తరువాత కాలంలో కాల్షియం ఉండే ఫుడ్ తీసుకోకపోవడంతో ఎముకలు త్వరగా బలహీన పడుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- మహిళల్లో హార్మోన్ల మార్పులతో కీళ్ల నొప్పుల ప్రభావం 45 శాతానికి పైగా కన్పిస్తోందని వైద్యులు చెబుతున్నారు. 45 ఏళ్లు దాటిన మహిళల్లో నెలసరి ఆగడం వల్ల శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ స్థాయి తగ్గి, ఎముకల్లోని కాల్షియం వేగంగా హరించుకుపోతోంది. పురుషుల్లో శారీరక శ్రమ లేకపోవడం వంటి వ్యతిరేక జీవనశైలి వల్ల జిగురు (కార్టిలైజ్) తగ్గిపోయి తీవ్రమైన నొప్పులు మొదలవుతున్నాయి.
- 55 ఏళ్ల పైబడిన వారిలో ఎముకల సమస్యలు 60 శాతానికి పైగా వున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఎముకలు గుల్లబారిపోయే ఆస్టియోపోరోసిస్ వ్యాధి వేధిస్తోంది. బాత్రూంలో చిన్నపాటి జారుడు లేదా ఇంట్లో కాలు బెణికినా కూడా తుంటి ఎముక, వెన్నుపూసలు లేదా మణికట్టు ఎముకలు విరిగిపోతున్నాయి. తగినంత కాల్షియం, విటమిన్ డి అందకపోవడం, వ్యాయామం లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు.

**ఆహారపు అలవాట్లు కీలకం**

ఆహారంలో పాలు,పెరుగు, ఆకుకూరలు, రాగులు, గుడ్లు వుండేలా చూసుకోవాలి. ఇవి సహజ సిద్ధమైన కాల్షియం అందిస్తాయి. ప్రతిరోజు 15 నుంచి 20 నిమిషాల పాటు ఉదయం ఎండలో నడవడంతో సహజ విటమిన్ డి అందుతుంది. ఎముకలు ధృడంగా వుండడానికి ప్రతి రోజు నడక, సైక్లింగ్ లేదా తేలికపాటి వ్యాయామాలు అలవాటు చేసుకోవాలి. సరైన పౌష్టికాహరం తీసుకోవడం, ధూమపానం, మద్యపానాన్ని ఆపివేయడం ఆరోగ్యానికి మంచిది.

**జీవనశైలి మార్పుల వల్లే ఎముకలు బలహీనం**

డాక్టరు మోపాడ ప్రవీణ్‌కుమార్,

మారిన జీవనశైలితో జిల్లాలో చిన్న వయసులోనే ఎముకల బలహీనత, కీళ్ల అరుగుదల పెరుగుతోంది. నిరంతరం కదలకుండా కూర్చుని పనిచేయడం, విటమిన్ డి లోపం, జంకుఫుడ్స్, కూల్‌డ్రింక్ ?స వినియోగం వల్ల 30ఏళ్లకే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్నాయి. ప్రారంభంలో వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ, బరువు తగ్గడం, పౌష్టికాహారం తీసుకోవడం, నడవడం చేస్తే సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి. వైద్యుని సలహాలు తీసుకోకుండా సొంతంగా పెయిన్ కిల్లర్స్ వాడొద్దు. దీని వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

# దుబ్బగూడా పీహెచ్‌సీకి పెరుగుతున్న రోగులు

## రోజుకు 50 నుంచి 80 మంది వరకు ఓపీ.. అందుబాటులో అన్ని రకాల వైద్య సేవలు





ఆదిలాబాద్, మావల,(ఆరోగ్యజ్యోతి): మావల మండలంలోని దుబ్బగూడా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కు రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రారంభించిన రెండు నెలలు పూర్తికాకముందే పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఆసుపత్రి నిత్యం రోగులతో సందడిగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 50 నుంచి 80 మంది వరకు ఔట్ పేషెంట్ (ఓపీ) రోగులు వైద్య సేవల కోసం పీహెచ్‌సీని ఆశ్రయిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన ఈ ప్రభుత్వ వైద్య కేంద్రం పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి రావడంతో స్థానికంగా వైద్య సేవలు పొందే అవకాశం కలిగింది. దుబ్బగూడా పీహెచ్‌సీ ప్రారంభం కావడంతో మావల మండలంలోని పలు గ్రామాలు, కాలనీల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. మావల న్యూ హౌసింగ్ బోర్డు, కొమరం భీమ్ కాలనీ, రామ్‌నగర్, సుభాష్‌నగర్, దుబ్బగూడా, టైలర్స్ కాలనీ, బట్టి సవరగామా తదితర ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తున్నారు. గతంలో సాధారణ అనారోగ్య సమస్యలకు కూడా దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం తమకు సమీపంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రావడంతో సమయం, ప్రయాణ ఖర్చు తగ్గుతోందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. పీహెచ్‌సీలో ఒక వైద్యుడితో పాటు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది, విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఓపీకి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, శరీర నొప్పులు వంటి సమస్యలతో పాటు రక్తపోటు, మధుమేహం తదితర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు కూడా వైద్యులను సంప్రదిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన మందులు అందించడం, ఆరోగ్యపరమైన సూచనలు ఇవ్వడం, తదుపరి చికిత్స అవసరమైన వారికి ఉన్నత వైద్య కేంద్రాలకు సూచించడం వంటి సేవలు అందుతున్నాయి. కొత్తగా ఏర్పాటైన పీహెచ్‌సీకి ప్రారంభంలో పరిమిత సంఖ్యలోనే రోగులు వచ్చినప్పటికీ, వైద్య సేవలు అందుబాటులోకి రావడం, స్థానిక ప్రజల్లో అవగాహన పెరగడంతో ఓపీ సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా సమీప కాలనీలు, గ్రామాల ప్రజలు చిన్నపాటి ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా దుబ్బగూడా పీహెచ్‌సీని ఆశ్రయిస్తున్నారు. దీంతో ఉదయం నుంచే పీహెచ్‌సీ పరిసరాల్లో రోగులు, వారి కుటుంబ సభ్యులతో సందడి కనిపిస్తోంది.

ప్రభుత్వం గ్రామీణ, పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య కేంద్రాల ద్వారా స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. దుబ్బగూడా పీహెచ్‌సీ కూడా ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన ప్రభుత్వ వైద్య కేంద్రంగా మారుతోంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ఉపయుక్తంగా మారింది. పీహెచ్‌సీకి రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ సంఖ్యను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో మరిన్ని వైద్య సేవలు, అవసరమైన సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బందిపై అదనపు పనిభారం పడకుండా అవసరమైన సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. దుబ్బగూడా పీహెచ్‌సీ మరింత అభివృద్ధి చెందితే మావల మండలంలోని పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు మరింత సులభంగా అందే అవకాశం ఉంది.

# హెచ్‌ఐవీ నివారణపై ప్రత్యేక దృష్టి.. ప్రతి కేసుకు నిరంతర వైద్య సేవలు

## హైరిస్క్ గ్రూపులపై ప్రత్యేక నిఘా.. విస్తృత అవగాహన కార్యక్రమాలకు అధికారుల






వరంగల్, (ఆరోగ్యజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. హెచ్‌ఐవీ నియంత్రణ కార్యక్రమాల పురోగతి, కేసుల నమోదు, చికిత్స అందుతున్న విధానం, అవగాహన కార్యక్రమాలు, హైరిస్క్ గ్రూపుల గుర్తింపు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అప్పయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ యూనిట్ అధికారులు, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్లు, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఎన్‌జీవో ప్రతినిధులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో అమలవుతున్న హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల పురోగతిని అధికారులు సమీక్షించారు. హెచ్‌ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన ప్రతి కేసును తప్పనిసరిగా అధికారిక రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు, నివేదికల్లో సక్రమంగా పొందుపరచాలని సూచించారు. సంబంధిత వ్యక్తులకు అవసరమైన యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ), కౌన్సిలింగ్, వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి నియంత్రణలో ముందస్తు గుర్తింపు కీలకమని అధికారులు పేర్కొన్నారు. హైరిస్క్ గ్రూపులకు చెందిన వ్యక్తులను గుర్తించి, వారికి హెచ్‌ఐవీ పరీక్షల ప్రాధాన్యతను వివరించి, స్వచ్ఛందంగా స్క్రీనింగ్ చేయించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి హెచ్‌ఐవీపై ఉన్న అపోహలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్‌ఐవీ నియంత్రణకు కేవలం కేసులను గుర్తించడం మాత్రమే కాకుండా, కౌన్సిలింగ్, చికిత్స, మందుల వినియోగం, వైద్య పర్యవేక్షణ, నిరంతర ఫాలోఅప్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన సమాచారం, అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. వివిధ విభాగాల అధికారులు, వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, ఎన్‌జీవోలు సమన్వయంతో పనిచేసినప్పుడే హెచ్‌ఐవీ నియంత్రణ కార్యక్రమాలు మరింత ఫలప్రదంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు హెచ్‌ఐవీ నివారణ మార్గాలు, పరీక్షల ప్రాధాన్యత, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డా. మధన్ మోహన్, నోడల్ అధికారి/ప్రోగ్రాం అధికారి, డా. అరుణ్ జోషి, ప్రోగ్రాం అధికారి, వరంగల్, స్వప్న మాధురి, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ యూనిట్, డేటా మేనేజర్ కమలాకర్, ఏఆర్‌టీ వైద్య అధికారులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఎన్‌జీవో ప్రతినిధులు, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ యూనిట్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంజీఎం ఆసుపత్రిలో కుక్కల స్వైర విహారం!...

## రోగుల మధ్యే వీధి కుక్కల సంచారం.. ఆసుపత్రి భద్రత, పారిశుద్ధ్యంపై తీవ్ర ప్రశ్నలు

వరంగల్,(ఆరోగ్యజ్యోతి):వరంగల్‌లోని ఉత్తర తెలంగాణకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రిలో పరిస్థితులు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఆసుపత్రి ప్రాంగణంలో వీధి కుక్కలు స్వేచ్ఛగా సంచరిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వైరల్ అవుతున్న వీడియోలో ఆసుపత్రి పరిసరాల్లో కుక్కలు కనిపించడం ఆసుపత్రి నిర్వహణపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. వైద్యం కోసం వచ్చే రోగులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోనే వీధి కుక్కలు తిరుగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న రోగులు ఉన్న ప్రాంతాల్లో కుక్కల సంచారం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. రోగులు విశ్రాంతి తీసుకునే ప్రదేశాలు, ఆసుపత్రి వార్డుల సమీప ప్రాంతాల్లోకి కుక్కలు ఎలా ప్రవేశిస్తున్నాయి? ఆసుపత్రి ప్రవేశ ద్వారాలు, ప్రహరీ, భద్రతా వ్యవస్థపై పర్యవేక్షణ ఉందా? కుక్కలను నియంత్రించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**గత ఘటనలతోనూ సంబంధం ఉందా?**

ఎంజీఎం ఆసుపత్రిలో వీధి జంతువుల సమస్యపై గతంలోనూ తీవ్ర విమర్శలు వచ్చాయి. 2024 ఆగస్టులో ఆసుపత్రి ప్రాంగణంలో నవజాత శిశువు మృతదేహాన్ని కుక్కలు ఈడ్చుకెళ్లి తిన్న ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు. అయితే అప్పట్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందిస్తూ ఆ శిశువు ఆసుపత్రిలో చికిత్స పొందిన శిశువు కాదని, బయట నుంచి కుక్కలు తీసుకొచ్చి ఉండవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా 2025 డిసెంబరులో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగిని ఎలుక కరిచిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఆసుపత్రి పారిశుద్ధ్యం, పెస్ట్ కంట్రోల్, నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తింది. ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ తదితర సేవల కోసం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి.

**కోట్ల రూపాయల నిర్వహణ.. అయినా సమస్య ఎందుకు?**

ఎంజీఎం వంటి భారీ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల భద్రత, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వంటి అంశాలకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. అయినప్పటికీ వీధి కుక్కలు ఆసుపత్రి ప్రాంగణంలో స్వేచ్ఛగా సంచరిస్తున్న దృశ్యాలు కనిపించడం నిర్వహణ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ప్రభుత్వం ఆసుపత్రుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్న సమయంలో కనీస పారిశుద్ధ్యం, భద్రతా ప్రమాణాలు ఎందుకు అమలు కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**రోగుల భద్రత ఎవరి బాధ్యత?**

ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి వైద్యం పొందుతున్న సమయంలో అతని భద్రతకు ఆసుపత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలి. ముఖ్యంగా కుక్కకాటు, రేబిస్ వంటి ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రి ప్రాంగణంలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు అవసరం. కుక్కల సంచారం వల్ల భయాందోళనకు గురవుతున్న రోగులు, వారి బంధువులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో ఆహార వ్యర్థాలు, చెత్త, మిగిలిపోయిన ఆహారం వంటి వాటిని బహిరంగంగా ఉంచకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆసుపత్రిలోని ప్రవేశ మార్గాలు, ప్రహరీ ప్రాంతాలు, గేట్లను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల నిర్లక్ష్యమా? పర్యవేక్షణ లోపమా?**

వీధి కుక్కలు ఆసుపత్రి లోపలికి చేరేంత వరకు పరిస్థితి ఎందుకు గుర్తించబడలేదనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. ఆసుపత్రి నిర్వహణలో భాగంగా పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్నదానిపై ఉన్నతాధికారులు సమీక్ష చేయాలని ప్రజలు కోరుతున్నారు. సీసీ కెమెరాల ద్వారా ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారాలు, వార్డుల పరిసరాలు, పార్కింగ్, చెత్త నిల్వ ప్రాంతాలు, ప్రహరీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.ద

**‘చర్యలు తీసుకున్నాం’ అనే ప్రకటనలకే పరిమితం కాకూడదు**

ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చిన ప్రతిసారీ విచారణకు ఆదేశించడం, సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం మాత్రమే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో కుక్కలు ప్రవేశించకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలి. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి. చెత్త నిర్వహణను కట్టుదిట్టం చేయాలి. పెస్ట్ కంట్రోల్ వ్యవస్థను పర్యవేక్షించాలి. సెక్యూరిటీ సిబ్బంది విధులను కఠినంగా అమలు చేయాలి.

**ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించాలి**

తాజాగా వైరల్ అవుతున్న వీడియోపై ఎంజీఎం ఆసుపత్రి అధికారులు, వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలి. ఆసుపత్రిలోకి వీధి కుక్కలు ఎలా వస్తున్నాయో గుర్తించి, వాటి నియంత్రణకు తీసుకున్న చర్యలను వెల్లడించాలి. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేద ప్రజలకు చివరి ఆశ్రయం. అక్కడ వైద్యం కోసం వచ్చే రోగులకు భద్రత, పరిశుభ్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

# రాయపర్తి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

## మందుల నిల్వలు, రికార్డులు, ఆపరేషన్ థియేటర్ పరిశీలన.. సిబ్బందికి కీలక సూచనలు

## వర్షాకాల వ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే, డ్రై డే కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశం





రాయపర్తి, (ఆరోగ్యజ్యోతి): రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలోని రికార్డులు, వివిధ రిజిస్టర్లను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ వాటిని ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. రోగులకు అందుతున్న సేవలు, వైద్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని నిరంతరం కొనసాగించాలని డాక్టర్ అప్పయ్య సూచించారు. ఆసుపత్రిలోని మందుల స్టాక్‌ను క్రమపద్ధతిలో అమర్చుకోవాలని, ఒకే రకమైన మందులకు వేర్వేరు గడువు తేదీలు ఉన్నప్పుడు ముందుగా గడువు ముగిసే మందులను ముందుగా వినియోగించే విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం సురక్షితంగా తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ అక్కడి పరికరాలు, పరిశుభ్రత, నిర్వహణ పరిస్థితులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌లో ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని, వైద్య పరికరాలను సక్రమంగా నిర్వహిస్తూ అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ అప్పయ్య ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రతిరోజూ ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని, అవసరమైన వారికి వెంటనే వైద్య సేవలు అందించాలని సూచించారు. జ్వర కేసులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ వ్యాధులు తీవ్ర రూపం దాల్చకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు క్రమం తప్పకుండా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి లార్వా నిర్మూలన చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో టెమిఫాస్ వినియోగిస్తూ దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు గ్రామస్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలకవర్గాలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఫీల్డ్ సిబ్బంది, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కలిసి పనిచేస్తూ కన్వర్జెన్స్ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై ముందస్తు అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణ, జ్వర లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యాధుల నియంత్రణలో కేవలం వైద్య సిబ్బంది మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం లేదా అసమర్థతకు పాల్పడితే నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. శ్రీనాథ్, హెచ్‌ఈఓ శిలగాని రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మాధవి, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బావిలో విషవాయువు.. నలుగురు మృతి

బిహార్, ఆగస్టు 14,(ఆరోగ్యజ్యోతి): బిహార్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. బావిలో మోటార్ మరమ్మతు చేసేందుకు దిగిన నలుగురు విషవాయువు పీల్చి మృతిచెందారు. మృతుల్లో తండ్రి, కుమారుడు ఉన్నారు. గయా జిల్లాలోని దోభి పోలీస్ స్టేషన్ పరిధి గర్హ్వా కర్మొని గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ రైతు బావిలో మోటార్ పాడైంది. మోటార్‌ను మరమ్మతు చేసేందుకు నలుగురు వ్యక్తులు బావిలోకి దిగారు. మరమ్మతు పనులు కొనసాగుతున్న సమయంలో బావిలో నుంచి ఒక్కసారిగాం విషవాయువు వెలువడినట్లు అధికారులు తెలిపారు. దాన్ని పీల్చిన నలుగురికి శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొద్దిసేపటికే వారు బావిలోనే కుప్పకూలిపోయారు. పరిస్థితిని గుర్తించిన స్థానికులు పోలీసులకు, అధికారులకు సమాచారం అందించారు. ఘటనలో చమారి మాంఝి, ఆయన కుమారుడు దిల్‌చంద్ మాంఝీ, వికాస్ చౌదరి, విజయ్ చౌదరి మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మృతదేహాలను బయటకు తీసి తదుపరి చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో గర్హ్వా కర్మొని గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బావిలో విషవాయువు ఎలా ఏర్పడింది, దాని కారణంగా ప్రమాదం ఎలా చోటుచేసుకుంది అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను పూర్తిగా తెలుసుకునేందుకు సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సుశీల్ కుమార్ తెలిపారు. నలుగురు మృతిచెందిన ఘటనపై ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొంటూ, ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బావులు, ఇతర మూసివున్న ప్రదేశాల్లోకి దిగే సమయంలో విషవాయువుల ప్రమాదం ఉండే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. బావిలోకి నేరుగా దిగే ముందు అక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలించడం, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# గుజరాత్‌లో చండీపుర వైరస్ కలకలం

**ఐదు వారాల్లో 25 మంది చిన్నారుల మృతి..**
**వందలాది అనుమానిత కేసులు**
**ఇసుక ఈగలు, దోమల్లో వైరస్ జాడ లేదు..**
**వ్యాప్తి మార్గంపై నిపుణుల్లో ఆందోళన**

**అహ్మదాబాద్, ఆగస్టు 13 (ఆరోగ్యజ్యోతి):** గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ముఖ్యంగా చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ వైరస్ కారణంగా కేవలం ఐదు వారాల వ్యవధిలోనే 25 మంది చిన్నారులు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో అనుమానిత కేసులు నమోదవుతుండటంతో వైద్య, ఆరోగ్యశాఖలు అప్రమత్తమయ్యాయి. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ.. అసలు వైరస్ ఏ మార్గంలో వ్యాప్తి చెందుతోందన్న విషయం ఇప్పటికీ స్పష్టంగా తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

వైరస్ వ్యాప్తికి కారణం ఏమిటి?

చండీపుర వైరస్ సాధారణంగా ఇసుక ఈగల ద్వారా వ్యాప్తి చెందుతుందని వైద్య నిపుణులు భావిస్తున్నారు. దీంతో వైరస్ వ్యాప్తి ప్రారంభమైన జూన్ 30 నుంచి ఆరోగ్యశాఖ అధికారులు పెద్ద ఎత్తున ఇసుక ఈగల నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. వేల సంఖ్యలో కీటకాల నమూనాలను పరీక్షించినప్పటికీ.. వాటిలో చండీపుర వైరస్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడం పరిశోధకులను అయోమయానికి గురిచేస్తోంది.

వేలాది కీటకాల నమూనాలు సేకరణ

ఇసుక ఈగలతో పాటు వైరస్‌ను మోసుకెళ్లే అవకాశం ఉన్న దోమలు, ఇతర కీటకాల నమూనాలను కూడా ఆరోగ్యశాఖ అధికారులు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించారు. అయితే ఇప్పటివరకు ఏ కీటకంలోనూ వైరస్ ఉనికి నిర్ధారణ కాలేదు. దీంతో చండీపుర వైరస్ వ్యాప్తికి ఇసుక ఈగలే కారణమా? లేక మరేదైనా వాహకం ద్వారా వైరస్ వ్యాపిస్తోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైరస్ వ్యాప్తి వెనుక ఉన్న కారణాలను గుర్తించేందుకు పరిశోధకులు మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నారు.

పశువులు, మేకల నమూనాలపై పరిశోధన

కీటకాల నమూనాల్లో వైరస్ జాడ కనిపించకపోవడంతో పరిశోధకులు ఇప్పుడు ఇతర మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పశువులు, మేకలతో పాటు వాటి పాలు, రక్త నమూనాలను కూడా పరీక్షించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు వెల్లడించింది. వైరస్ వ్యాప్తిలో జంతువుల పాత్ర ఏమైనా ఉందా? వాటి ద్వారా వైరస్ మనుషులకు చేరే అవకాశం ఉందా? అనే అంశాలను పరిశీలించనున్నారు.

**చిన్నారులపైనే తీవ్ర ప్రభావం**

చండీపుర వైరస్ ప్రధానంగా చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమానిత కేసుల్లో చాలామంది చిన్నారులే ఉండటంతో వైద్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే చిన్నారులను వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అనుమానిత కేసుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నారు.

**2024లోనూ 28 మంది మృతి**

చండీపుర వైరస్ ప్రభావం గుజరాత్‌లో కొత్తది కాదు. 2024లో కూడా ఈ వైరస్ లక్షణాలతో 78 మంది చిన్నారులు అనారోగ్యానికి గురయ్యారు. వారిలో 28 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి వైరస్ వ్యాప్తిపై అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం నమోదవుతున్న మరణాలు ఆందోళనను మరింత పెంచుతున్నాయి.

**గుజరాత్‌లో 12.. రాజస్థాన్‌లో 3 జిల్లాల్లో కేసులు**

ప్రస్తుతం గుజరాత్‌లోని 12 జిల్లాల్లో, పొరుగు రాష్ట్రం రాజస్థాన్‌లోని 3 జిల్లాల్లో చండీపుర వైరస్ బాధితులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో రెండు రాష్ట్రాల ఆరోగ్యశాఖలు సమన్వయంతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. అనుమానిత కేసులను త్వరగా గుర్తించడం, నమూనాలను పరీక్షించడం, బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందించడం వంటి చర్యలను ముమ్మరం చేస్తున్నారు.

వ్యాప్తి మార్గం గుర్తించడమే కీలకం

వైరస్‌కు సంబంధించిన కేసులు, మరణాలు నమోదవుతున్నప్పటికీ దాని వ్యాప్తి మార్గంపై స్పష్టత లేకపోవడం ప్రస్తుతం పరిశోధకులకు ప్రధాన సవాలుగా మారింది. ఇసుక ఈగల్లో వైరస్ జాడ లభించకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పశువులు, మేకలు, ఇతర కీటకాలు, పర్యావరణ పరిస్థితులు తదితర అంశాలను పరిశీలిస్తూ వైరస్ మూలాన్ని గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

1965లో తొలిసారి గుర్తింపు

చండీపుర వైరస్‌ను తొలిసారిగా 1965లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని చండీపుర ప్రాంతంలో గుర్తించారు. ఆ ప్రాంతం పేరుమీదుగానే ఈ వైరస్‌కు 'చండీపుర వైరస్' అనే పేరు వచ్చింది. అప్పటి నుంచి దేశంలోని పలు ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఈ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారుల్లో తీవ్ర అనారోగ్యానికి దారితీసే అవకాశం ఉండటంతో వైద్యశాఖలు దీనిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాయి.

**అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

ప్రస్తుత పరిస్థితుల్లో అనుమానిత కేసులను వెంటనే గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించడం, చిన్నారుల్లో అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వైరస్ వ్యాప్తికి అసలు కారణం ఏమిటో గుర్తించేందుకు పరిశోధనలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు

# 10 నిమిషాల్లో రాకపోతే.. రూ.10 వేల జరిమానా..

**అంబులెన్స్‌లకు సైరన్**
**గోల్డెన్ అవరైన గంటలోపు క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చాలి -ఆలస్యమైనా, వెళ్లడానికి నిరాకరించినా జరిమానా తప్పదు .**
**అంబులెన్సులకు ఎన్‌హెచ్ఏఐ కొత్త నిబంధనలు - హైవేలపై సేవల్లో ఉన్న 3 వేల అంబులెన్స్‌లకు వర్తింపు**

న్యూఢిల్లీ, ఆగస్టు 13: జాతీయ రహదారులపై అంబులెన్సులు ప్రమాద ఘటనా స్థలికి 10 నిమిషాల్లోపు చేరుకోవాలి. టికెట్ అంగీకరించిన క్షణం నుంచి గంటలోపు బాధితులను సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలి. వీటిలో ఏది జరగకపోయినా రూ.10 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈమేరకు జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) నూతన పాలసీ గైడ్‌లైన్స్‌ను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం 1033కి కాల్ వచ్చిన తరువాత ఘటనా స్థలానికి సమీపంలోని అంబులెన్సులకు ఎమర్జెన్సీ అలర్ట్ వెళ్తుంది. దానిని ఆ అంబులెన్స్ అంగీకరించాలి. తిరస్కరిస్తే అంతేమొత్తంలో జరిమానా చెల్లించాలి. అంగీకరించిన క్షణం నుంచి 10 కి.మీ. దూరాన్ని 10 నిమిషాల్లో చేరుకోవాలి. లేకుంటే జరిమానా తప్పదు. వెళ్లాల్సిన ప్రాంతం 10 కి.మీ.కు మించి ఉంటే జీపీఎస్ రికార్డులను అనుసరించి దామాషా ప్రకారం సమయాన్ని ఇస్తారు. టికెట్ అంగీకరించాక గంటలోపు బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఆలస్యమైతే పదివేల రూపాయలు పెనాల్టీ చెల్లించాల్సిందే. దేశవ్యాప్తంగా 3000 అంబులెన్సులు సేవలందిస్తున్నాయి. అంబులెన్సుల్లో అత్యవసర వైద్య పరికరాలు, మందులు, సిబ్బంది ఉండాలి. కొరత ఉంటే రూ.10 వేలు జరిమానా చెల్లించాల్సిందే. ఎన్‌హెచ్ఏఐ కేర్ సిస్టమ్ సమర్థంగా పనిచేసేందుకు వాహనాలన్నింటికీ ఏఐఎస్-140 ప్రామాణికానికి అనువైన జీపీఎస్ పరికరం అమర్చి ఉంటుంది. ప్రతి వాహనానికీ డెడికేటెడ్ ఆండ్రాయిడ్ మొబైల్, ఐఓటీతో కూడిన సిమ్ సౌకర్యం కల్పించినట్లు రహదారుల సంస్థ పేర్కొంది. ప్రమాదం జరిగినప్పుడు సహాయక చర్యలు ఆలస్యమవుతున్న విషయాన్ని సుప్రీం కోర్టు రోడ్డు భద్రతా కమిటీ, కాగ్ నిర్వహించిన ఆడిట్ కూడా గుర్తించాయి. సవరించిన నూతన పాలసీ నిబంధనలను అమలు చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్లకు, ప్రాంతీయ అధికారులకు ఎన్‌హెచ్ఏఐ సూచించింది. ఇక నుంచి డంపర్లు, టిప్పర్లు పై భాగంలో

## రెయిన్‌బో వైద్యుల మరో ఘనత
## – అరుదైన రుగ్మతతో బాధపడుతున్న గర్భిణికి విజయవంతంగా ప్రసవం

హైదరాబాద్,(ఆరోగ్యజ్యోతి): అరుదైన రక్తసంబంధిత రుగ్మత 'ఫ్యాక్టర్-వీ' లోపంతో బాధపడుతున్న గర్భిణికి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ వైద్యులు విజయవంతంగా ప్రసవం జరిపారు. లక్షల్లో ఒకరికి వచ్చే ఈ రుగ్మతతో ప్రసవ సమయంలో తీవ్ర రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంటుందని, దీని వల్ల ప్రాణాపాయ పరిస్థితి పొంచి ఉంటుందని వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఏపీలోని కర్నూలుకు చెందిన 23 ఏండ్ల మహిళ 39 వారాల గర్భంతో జూన్‌లో రెయిన్‌బో వైద్యులను సంప్రదించింది. సదరు గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఫ్యాక్టర్-వీ లోపం ఉన్నట్టు గుర్తించారు. అరుదైన, క్లిష్టమైన సమస్య కావడంతో సీనియర్ కన్సల్టెంట్, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ హిమబిందు అన్నమరాజు నేతృత్వంలో క్లినికల్ హెమటాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, అనస్థీషియా నిపుణులతో కూడిన బహుళ విభాగాల బృందం ముందస్తు ప్రణాళికతో చికిత్స

## ఫుడ్ ప్రమోషన్‌లో ఇక ఇష్టారాజ్యం కుదరదు!

ఉత్పత్తి గురించి పూర్తిగా తెలుసుకున్నాకే ప్రచారం చేయాలి..
తప్పుదు ఆరోగ్య క్లెయిమ్‌లు చేస్తే చట్టపరమైన చర్యలు



న్యూఢిల్లీ,(ఆరోగ్యజ్యోతి):సోషల్ మీడియా వేదికగా ఆహార పదార్థాలు, పానీయాలు, న్యూట్రిషన్ ఉత్పత్తులను ప్రచారం చేసే సెలబ్రిటీలు, ఫుడ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లకు భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఖీూూూ×) కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇకపై ఏదైనా ఆహార ఉత్పత్తిని వాణిజ్యపరంగా ప్రచారం చేసే ముందు ఆ ఉత్పత్తి గురించి పూర్తి అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి అని స్పష్టం చేసింది.

**కంపెనీ చెప్పిందని ప్రచారం చేస్తే సరిపోదు....**

ఒక ఉత్పత్తిని ప్రచారం చేసే వ్యక్తి.. కేవలం తయారీ సంస్థ అందించిన ప్రచార సమాచారాన్ని నమ్మి ప్రజలకు సిఫారసు చేయకూడదని ఖీూూూ× సూచించింది. ఉత్పత్తిలో ఉపయోగించిన పదార్థాలు ఏమిటి? వాటి పరిమాణం ఎంత? ఉత్పత్తి వల్ల చెప్పే ప్రయోజనాలకు ఆధారాలు ఉన్నాయా? దాని వల్ల ఏమైనా పరిమితులు లేదా నష్టాలు ఉన్నాయా? వంటి అంశాలను ముందుగానే తెలుసుకోవాలని సూచించింది.

**"ఇమ్యూనిటీ పెంచుతుంది".. "ఆరోగ్యానికి అద్భుతం" అంటూ చెబితే?**

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఫుడ్ ఉత్పత్తుల ప్రచారంలో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాల క్లెయిమ్‌లు కనిపిస్తున్నాయి. "ఇమ్యూనిటీ పెంచుతుంది", "పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి", "ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది" వంటి క్లెయిమ్‌లను ఆధారాలు లేకుండా ప్రచారం చేయడంపై ఖీూూూ× దృష్టి సారించింది. నిర్ధారణ లేని క్లెయిమ్‌లను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**ఇన్‌ఫ్లుయెన్సర్ల బాధ్యత పెరిగింది**

సెలబ్రిటీ లేదా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఒక ఉత్పత్తిని ప్రచారం చేసినప్పుడు.. దాన్ని చూసే వినియోగదారులు ఆ సిఫారసును నమ్మే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రచారం చేసే వ్యక్తి బాధ్యత కేవలం ప్రకటన చేయడంతో ముగియదని ఖీూూూ× తాజా హెచ్చరిక స్పష్టం చేస్తోంది.ప్రత్యేకంగా ఆరోగ్యం, పోషకాహారానికి సంబంధించిన ఉత్పత్తుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. వినియోగదారులను తప్పుదారి పట్టించేలా అతిశయోక్తి వ్యాఖ్యలు చేయకూడదు.

**ఆహార ఉత్పత్తి అంటే.. ఆరోగ్య ఉత్పత్తి కాదు!**

ఆహార పదార్థానికి సంబంధించిన సాధారణ పోషక లక్షణాలను, నిర్ధారణ లేని వైద్య ప్రయోజనాలుగా చూపించడం ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. ఒక సాధారణ ఆహార పదార్థాన్ని "వ్యాధి నివారణకు మందు"గా లేదా "అన్ని ఆరోగ్య సమస్యలకు పరిష్కారం"గా చూపించే ప్రచారం వినియోగదారులను తప్పుదారి పట్టించే అవకాశం ఉంది.అందుకే ఆహార ఉత్పత్తుల ప్రచారంలో ఆహారం, పోషకాహారం, ఆరోగ్య క్లెయిమ్, వైద్య చికిత్స మధ్య ఉన్న తేడాలను స్పష్టంగా పాటించాల్సిన అవసరం ఉంది.

**ఫుడ్ రివ్యూలు చేసేవారికీ ఇదే వర్తింపు**

రెస్టారెంట్లు, హోటళ్లు, ఫుడ్ అవుట్‌లెట్లు, ఫుడ్ బ్రాండ్లపై సోషల్ మీడియాలో రివ్యూలు చేసే కంటెంట్ క్రియేటర్లు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం పెరుగుతోంది. ఇటీవల ఫుడ్ ఇన్‌ఫ్లుయెన్సర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో కూడా సంబంధిత అధికారులు ఖీూూూ× లైసెన్స్, పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు.

**వినియోగదారుల ఆరోగ్యంతో ఆటలొద్దు**

సోషల్ మీడియా ద్వారా ఒక్క ప్రచార వీడియో లక్షలాది మందికి చేరే అవకాశం ఉంది. ఒక ఉత్పత్తిపై తప్పుదారి పట్టించే సమాచారం వైరల్ అయితే దాని ప్రభావం కూడా భారీగా ఉండొచ్చు. అందుకే ఫుడ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీలు, యూట్యూబర్లు, డిజిటల్ ప్రమోటర్లు తమ బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది.



# ఊపిరి పీల్చడం కష్టమే?.

**స్వచ్ఛమైన గాలికోసం కేంద్రం చేసిన ఖర్చు రూ.16,423 కోట్లు – అయినా 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' అట్టర్ ఫ్లాప్...**
**అమెరికాలో వద్దన్న కంపెనీలకు భారత్‌లో స్థానం... – భయపెడుతున్న వాయు కాలుష్యం**



న్యూఢిల్లీ,(ఆరోగ్యజ్యోతి):దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కారణంగా ప్రభుత్వం సెలవులు ప్రకటించే దుస్థితి. ముంబయి, కోల్‌కతా, సూరత్, అహ్మదాబాద్, పూణే, భువనేశ్వర్, అమృత్‌సర్ , గౌహతి నగరాలదీ దాదాపు అదే పరిస్థితి. దేశంలోని ప్రధాన నగరాల్లో వాయి కాలుష్యం తీవ్రత ఎక్కువగా ఉంది. దీన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం' (ఎన్‌సీఏపీ) అనే స్కీంను ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ స్కీం ద్వారా రూ.16,423 కోట్లు ఖర్చు చేసింది. దానిలో 2023 నుంచి 2026 మార్చి వరకు చేసిన ఖర్చు అక్షరాలా రూ.6,822 కోట్లు. ఈ నిధులన్నీ ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాలకే అధికంగా కేటాయించబడ్డాయి. ఈ నిధులు ఖర్చు చేసిన చోట్ల వాతావరణ పరిస్థితుల్లో ఏమైనా మార్పులు వచ్చాయా అని పరిశీలిస్తే...అలాంటిదేం లేదని శాస్త్రీయ ఆధారాలు రుజువు చేస్తున్నాయి. ఆ నిధుల వినియోగం చేసిన 83 శాతం నగరాల్లో గాలి నాణ్యత ఇప్పటికీ అధ్వాన్నంగానే ఉందని తాజా నివేదికలు చెప్తున్నాయి. దీనితో ఈ నిధుల ఖర్చుపై సహజంగానే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మారని పర్యావరణ మార్పుల కోసం అన్ని వేల కోట్లు ఎందుకు ఖర్చు చేశారనేదే ప్రశ్నార్థకం!

మార్పు లేదన్న కేంద్రం

ఇదే విషయాన్ని ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ , వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆగస్టు 10న లోక్‌సభలో వివరాలు వెల్లడించింది. వాయు కాలుష్య నియంత్రణ కోసం రూ. 800 కోట్లకు పైగా ఖర్చు చేసినప్పటికీ మహారాష్ట్రలోని ముంబయి సహా మొత్తం 19 నగరాల్లో గడచిన మూడేండ్లు గా సూక్ష్మ ధూళి కణాలు(పీఎం)10 మైక్రో మీటర్ల కంటే ఎక్కువ ఉన్నాయని నిర్ధారణ అయ్యింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాల ప్రకారం గాలిలో సూక్ష్మ ధూళి కణాలు 2.5 మైక్రోమీటర్లకంటే దాటరాదు. ఇలాంటి సూక్ష్మ ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి నేరుగా వెళ్తాయి. తద్వారా శ్వాస సంబంధ సమస్యలు తీవ్రమవుతాయి. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో 'జాతీయ పరిసర గాలి నాణ్యత ప్రమాణాల' (ఎన్ఏఏక్యూఎస్) పరిమితిని దాటి ఉన్నట్టుగా స్పష్టంగా తెలుస్తోంది.

పీఎం 10 అంటే..

పీఎం10 (అంటే 10 మైక్రాన్ల కంటే తక్కువ వ్యాసం కలిగిన సూక్ష్మ కణాలు) అనేది ధూళి, నిర్మాణ సామాగ్రి, రవాణా రంగం నుంచి వెలువడే ఉద్గారాలు , పుప్పొడి రేణువుల నుంచి కూడా

ఉత్పన్నమయ్యే వాయు కాలుష్య కారకం. ఎన్సీఏపీ ప్రధానంగా పీఎం 10పై దృష్టి సారిస్తున్నది. కానీ పీఎం 2.5 (అంటే 2.5 మైక్రాన్ల కంటే తక్కువ వ్యాసం కలిగిన సూక్ష్మ కణాలు) ప్రజల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.

ఈ నగరాల్లో మరీ అధ్వాన్నం

ముంబయి, ఢిల్లీ, కోల్‌కతా, సూరత్, అహ్మదాబాద్, పూణే, భువనేశ్వర్, అమృత్‌సర్ , గౌహతి నగరాలన్నీ 2023, 2024, 2025 , 2026 (జులై వరకు) సంవత్సరాలలో ఎన్ఏఏక్యూఎస్ ప్రమాణాలను మించిపోయాయి. 2019లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి 130 నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి ప్రభుత్వం రూ. 16,423 కోట్లకు పైగా ఖర్చు చేసింది. ఎన్సీఏపీ పరిధిలో అత్యధిక సంఖ్యలో నగరాలు కలిగిన రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర , ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. అవి ఈ జాబితాలో వరుసగా 13, 19 , 17 చొప్పున నగరాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని ఏ నగరంలోనూ గాలి నాణ్యత జాతీయ సురక్షిత ప్రమాణాల పరిధిలో లేకపోగా (అన్నీ ప్రమాణాలను మించి ఉన్నాయి), ఉత్తరప్రదేశ్‌లోని 17 నగరాల్లో 16 నగరాలు ఎన్ఏఏక్యూఎస్ పరిమితులను మించి ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో13 నగరాల్లో 8 నగరాలు నిర్దేశిత ప్రమాణాలను అందుకోలేకపోయాయి. బీహార్‌లోని మూడు నగరాలు, గుజరాత్‌లోని నాలుగు నగరాలు , ఒడిశాలోని ఏడు నగరాలు కూడా అవసరమైన గాలి నాణ్యత ప్రమాణాలను పాటించడంలో విఫలమయ్యాయి. ఈ నగరాలన్నింటిలో కేంద్రం నిధుల్ని ఖర్చుచేసింది.

ఇవీ లక్ష్యాలు..

ఎన్సీఏపీ కింద ప్రతి నగరం 2025-26 నాటికి సూక్ష్మ కణాల కాలుష్యాన్ని 40 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ లోక్‌సభలో పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానం ప్రకారం మొత్తం 130 నగరాల్లో కేవలం 26 నగరాలు మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించగలిగాయి. అదే సమయంలో, ఈ కార్యక్రమంలో జాబితా చేయబడిన నగరాల్లో 10 శాతం కంటే తక్కువగా, అంటే కేవలం 14 నగరాలు మాత్రమే పీఎం 10 సాంద్రతకు సంబంధించిన ఎన్ఏఏక్యూఎస్ ప్రమాణాలను అందుకున్నాయని వెల్లడైంది. మరి మిగిలిన నగరాల్లో పరిస్థితులు ఎందుకు మారలేదనేదానికి కేంద్రం వద్ద సమాధానాలు లేవు..

ప్రభుత్వ విధానాలే కారణం

వాయు కాలుష్యానికి కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. పట్టణాలు, పల్లెల్లో ప్రభుత్వ ప్రజారవాణా వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి, ప్రయివేటు, కార్పొరేట్ వ్యాపారాల కోసం వ్యక్తిగత వాహనాల సంఖ్యను పెంచేశారు. దానికి తోడు అమెరికా వంటి సంపన్న దేశాల్లో అక్కడి ప్రజల ఆరోగ్యం కోసం తిరస్కరించబడిన అనేక పరిశ్రమల్ని భారతదేశంలో నెలకొల్పుకునేందుకు అనుమతులు ఇచ్చారు. అమెరికాలో వద్దనుకున్న డేటా సెంటర్ల ఏర్పాటు కూడా దానిలో భాగమే. మరోవైపు అదానీ, అంబానీలకు భూగర్భ ఖనిజాలను కట్టబెట్టేందుకు వేల ఎకరాల అడవులను కూడా వారికి ధారాదత్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ పేరుతో వేల కోట్ల రూపాయాల నిధుల్ని ఖర్చు చేస్తూ, వాటి ఫలితాలను మాత్రం విస్మరిస్తున్నారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2019లో ఎన్సీఏపీని ప్రారంభించి, ప్రాధాన్యతల పేరుతో బీజేపీ పాలిత రాష్ట్రాలకు వరుసగా నిధుల్ని విడుదల చేస్తూనే ఉంది.




Printed and Published by Kadam Naresh Kumar , Publications on of Sri Akshara Door No 4-104 Ramnagar Word No-11, Adilabad, Dist ADILABAD -504001 Telangana. Editor: by Kadam Naresh Kumar Door No 4-104 Ramnagar Word No-11, Adilabad, Dist ADILABAD -504001 Telangana.RNI No -